రేపటి పౌరులు.. నేటి కష్టాలు..!

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ప్రభుత్వ వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. వసతుల లేమితో విద్యార్థులు కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. హాస్టల్ నిర్వహణ వ్యయం, కాస్మోటిక్స్ చార్జీల విడుదలపై సర్కారు మీనమేషాలు లెక్కిస్తుండటంతో విద్యార్థుల ఇక్కట్లు చెప్పేలా లేవు. హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించి నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

- అద్దె భవనాల్లో అరకొర వసతులు
- మరుగుదొడ్ల సమస్యతో తిప్పలు
- ఆరు బయటే విద్యార్థుల స్నానం..
- కిటికీలకు దోమతెరలు లేకపోవడంతో పాటు చలికి విద్యార్థుల ఇక్కట్లు



హనుమంతునిపాడు ఎస్సీ హాస్టల్‌లో నీటి ట్యాంక్ వద్ద అధ్వాన్న పారిశుధ్యం



మాలపాడు కేజీబీవీలో విద్యుత్ సౌకర్యం లేక నిరుపయోగంగా ఉన్న తరగతి గది

కనిగిరి రూరల్: సంక్షేమ హాస్టళ్లలో సమస్యల మోత మోగుతోంది. ఆరు మండలాల్లోని వసతి గృహాలు కనీస సౌకర్యాలు కరువై విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎక్కువ శాతం హాస్టళ్లలో సౌకర్యాలు లేక ఆరుబయట స్నానాలు చేయాల్సి వస్తోంది. హాస్టళ్లలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పేరుతో రూపురేఖలు మార్చింది. సంక్షేమ హాస్టళ్లను అదేస్థాయిలో మార్పు చేయాలని

✦ కనిగిరి మండలంలో ఒక కస్తూరిబా, నాలుగు ఎస్సీ హాస్టళ్లు, మూడు బాలుర, ఒకటి బాలికల) హైస్కూల్ స్థాయిలో, రెండు ఎస్సీ కాలేజీ హాస్టల్స్ ఉన్నాయి. ఒక హాస్టల్ మూత దశలో ఉంది. మిగిలిన వాటిలో ఆనంద నిలయం హాస్టల్ పాత భవనంలో, కంచర్లవారిపల్లి ఎస్సీ హాస్టల్ స్కూల్ భవనంలో నడుస్తోంది. అరకొర వసతులతో, నీటి సౌకర్యం మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

✦ పామూరు ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఫ్యాన్‌లు, కిటికీలకు మెస్‌లు లేవు. బీసీ హాస్టల్ బాత్‌రూములకు తలుపులు లేవు. విద్యార్థులకు సరిపడినన్నీ గదులు లేక ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ నిర్వహణ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వార్డెన్లు తెలిపారు.

✦ పీసీపల్లి ఎస్సీ హాస్టల్ అద్దె భవనంలో నడుస్తోంది. కనీస సౌకర్యాలు కరువై స్నానాలకు గదులు లేకపోవడంతో ఆరయుబయట చేస్తున్నారు. బహిర్భూమికి ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి.

✦ వెలిగండ్లలో ఎస్సీ, బీసీ హాస్టళ్లు ఉండగా..రెండూ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. రెండు హాస్టళ్లలో సౌకర్యాలు లేకపోవడంతో ఆరుబయట స్నానాలు చేస్తున్నారు.

✦ హనుమంతునిపాడు ఎస్సీ హాస్టల్‌లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. దీంతో ఒకరిద్దరు విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నారు. విద్యార్థులు స్నానం చేసేందుకు గదులు లేకపోవడంతో ఆరుబయటే స్నానం చేస్తున్నారు. విద్యార్థులకు ప్యాకెట్ మనీ రావడం లేదని చెబుతున్నారు.

సింగరాయకొండ: సింగరాయకొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం 50కి పైగా కోతులు తరగతి గదులు, హాస్టల్‌వద్ద సంచరిస్తూ విద్యార్థులను గాయపరిచిన ఘటనలు ఉన్నాయి. అయితే డైనింగ్ హాలు చాలకపోవడంతో విద్యార్థులు షిఫ్టుల వారీగా భోజనం చేయాల్సి వస్తోంది. రెండు నెలలుగా పాఠశాల క్లీనింగ్ మెటీరియల్ రావడం లేదు. పాఠశాలలో అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రికల్ లైటింగ్ సిస్టం సక్రమంగా లేకపోవడంతో తరుచూ సాంకేతిక సమస్య తలెత్తుతోంది. పాఠశాల మెయింటెన్స్ చార్జీలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

✦ సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల వసతి గృహం మూతపడటంతో ప్రస్తుతం విద్యార్థినులు బీసీ బాలికల కాలేజీ వసతి గృహంలో చేరాల్సి వచ్చింది.

పొన్నలూరు: మండలంలోని మాలపాడు కేజీబీవీలో 250 మంది విద్యార్థినులు ఉండగా వారికి సరిపడిన గదులు లేవు. విద్యార్థినులు రాత్రిళ్లు తరగతి గదుల్లోనే నిద్రిస్తున్నారు. సరిపడిన మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవు. అదనపు తరగతి గదులు నిర్మించినా విద్యుత్ సౌకర్యం, ఫ్లోరింగ్ సక్రమంగా లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి.

కొండపి: కొండపి గురుకుల పాఠశాలలో స్నానపుగదులకు విరిగిపోయిన తలుపులతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు క్లీనింగ్ మెటీరియల్ రాలేదు.

మద్దిపాడు: మండలంలోని రావెళ్లవారి పాలెం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 235 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అదనపు తరగతి గదులు లేవు. తరగతి గదులు మంజూరైనా నిర్మాణ దశలో ఆగిపోయాయి.



కనిగిరిలో కిటికీలకు దోమ తెరలు చినిగి పోయిన ఎస్సీ హాస్టల్



పామూరు: స్టడీలో ఉన్న 8 మంది విద్యార్థులు



మాలపాడు కేజీబీవీలో సరిపడిన గదులు లేకా బయట పెట్టిన బ్యాగులు

వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన దద్దాల



దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ వినాయక చవితి పండగ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గణనాథుని ఆశీస్సులతో.. క్షేమ, స్థైర్య అయురారోగ్యాలు, సకల సంపదలు సిద్ధించాలని, సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. ఇటీవల విజయవాడలో కురిసిన వర్షాలకు నిరాశ్రయులైన ప్రజలు త్వరగా కోలుకోవాలన్నారు. ప్రజల సమగ్రాభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఎదురవుతున్న విఘ్నాలన్నీ తొలగిపోయి.. ప్రజలందరికీ విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుని అనుగ్రహంతో ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో మరింత అభివృద్ధి చెందాలని దద్దాల అన్నారు.

కనిగిరి రూరల్: కనిగిరి ప్రాంత ప్రజలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకులు కదిరి బాబురావు శుక్రవారం ఒక ప్రకటనలో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. గణేష్ ఉత్సవాలను అంతా సంతోషంగా జరుపుకోవాలని కోరారు. పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ), మున్సిపల్ చైర్మన్ గఫార్‌లు వేర్వేరు ప్రకటనల్లో నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

జడా రిచర్డ్స్‌కు డాక్టర్ వెంకయ్య నివాళి



రిచర్డ్స్‌కు నివాళులర్పిస్తున్న డాక్టర్ వెంకయ్య

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి జెడ్పీటీసీ సభ్యురాలు మాతంగి చంద్రలీల భర్త జడా రిచర్డ్స్ భౌతిక కాయానికి శుక్రవారం పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రలీలను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎంపీపీ బెల్లం నిర్మల, పాడిబండ్ల నాగేశ్వరరావు, జగదీష్, నాగినేని భాస్కర్, దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, పల్లా అనూరాధ, దగ్గుమాటి శంకర రెడ్డి పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

వెలిగండ్ల: మండలంలోని ఇమ్మడిచెరువు, రామగోపాలపురం, గుడిపాటిపల్లి, సచివాలయాలను ఈఓపీఆర్ టి. సుకుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల హాజరు దస్త్రాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పద్మజ, షకీల తదితరులు పాల్గొన్నారు.

820 పొగాకు బేళ్లు కొనుగోలు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన వేలంలో 820 పొగాకు బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారు. కె. ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతులు 897 బేళ్లను వేలానికి తీసుకురాగా వాటిలో 820 కొనుగోలు చేశారు. 77 పొగాకు బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195 పలకగా, సరాసరి రూ.333.57 ధర పలికింది. వేలంలో మొత్తం 46 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358

కొండపి (సింగరాయకొండ): కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. అనకర్లపూడి, పెరిదేపి, మిట్టపాలెం, ముప్పరాజుపాలెం క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లోని రైతులు 1165 బేళ్లు వేలానికి తీసుకురాగా అందులో 984 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 181 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190, సరాసరి ధర రూ.293. వేలంలో 16 మంది వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

హనుమంతునిపాడు: దాతల సాయం అభినందనీయమని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కుందురు వెంకటేశ్వరెడ్డి అన్నారు. మండల పరిధి పెద్ద ముప్పళ్లపాడు ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 30 మంది బాల బాలికలకు ఆ గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు పోతిరెడ్డి మాలకొండారెడ్డి పోతిరెడ్డి ఈశ్వరమ్మ దంపతులు శుక్రవారం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, పలకలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ తమ కుమారుడు శేషులు పోతిరెడ్డి సుధీర్‌రెడ్డి జయంతి సందర్భంగా స్కూల్ మెటీరియల్ అంజేశామన్నారు. హెచ్‌ఎం కేవీ వెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ దాతల సహాయం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు స్వీట్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, సీఆర్‌పీ కొటికల చిన్నబాదుర్ల, దాతల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణకు నడుం బిగించిన విద్యార్థులు

పామూరు: విజయవాడ నగరవాసులు ఇటీవల విజయవాడలో వచ్చిన వరదలకు తీవ్రంగా ఆస్తులు నష్టపోగా మరికొందరు మృత్యువాత పడగా మరికొందరు తిండి, బట్టలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా వారిని ఆదుకునేందుకు అటు ఆర్థికసాయం, వస్తు రూపేణ సాయం కోసం శుక్రవారం మండల కేంద్రమైన పామూరులోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో ర్యాలీలు నిర్వహిస్తూ విరాళాలు సేకరించారు. ఆదిత్య జూనియర్ కళాశాల, అక్షర జూనియర్ కళాశాల, సెయింట్ మార్క్స్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని విరాళాలు సేకరించారు.

కనిగిరి రూరల్: వరద బాధితుల సహాయార్థం సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం కనిగిరిలో విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలోని నిర్వాసితులను ఆదుకునేందుకు పట్టణంలోని అన్ని వీధుల్లో తిరిగి రూ. 16 వేలు విరాళాలు సేకరించినట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. రవీంద్రబాబు తెలిపారు. సీపీఐ నాయకులు జీపీ రామారావు, పందిటి మోహన్, పవన్, ఖాశిం, కిరణ్, పుట్టా సుబ్బారావు, సురేష్, రామయ్య, యోహన్, కోటేశ్వరరావు, విఫ రాజ్, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంగా భవానికి నెల పొంగళ్లు



గంగామాత ఆలయంవద్ద నెలపొంగళ్ల కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, ఆలయ కమిటీ

పామూరు: మండలంలోని వగ్గంపల్లె గ్రామంలోని శ్రీగంగామాత ఆలయంలో గంగాభవాని ఆలయ 15వ వార్షికోత్సవ నెల పొంగళ్లు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గంగామాత మూల విగ్రహమూర్తికి అర్చకులు జాజుల మల్లేశ్వరి అభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ పాల్గొనగా ఆలయ కమిటీ జాజుల మాలకొండయ్య, గురవమ్మ, మాల్యాద్రి ఆయను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ గఫార్ ప్రారంభించారు. కార్యక్రమంలో గుమ్మళ్ల వెంకట నరసింహులు, దేగా జాలయ్య, రవి, వెంకట నారాయణ, భక్తులు పాల్గొన్నారు.

వినాయక చవితికి సర్వం సిద్ధం



తరలించేందుకు సిద్ధంగా ఉన్న గణ నాథులు

సాక్షి నెట్‌వర్క్: వినాయక చవితి పండుగకు గణేష్ మండపాలు సిద్ధమయ్యాయి. కనిగిరి, కొండపి నియోజకవర్గాల్లో వినాయకుని ప్రతిమలను భారీగా తరలించారు. అత్యధికంగా రూ. 35వేల రేటు విగ్రహాన్ని, అత్యల్పంగా రూ. 6వేల విగ్రహాలను కొనుగోలు చేశారు. పెద్ద విగ్రహాలను హైదరాబాద్ నుంచి తెచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. వినాయకచవితి అంటే అంతా ఇష్టంగా జరుపుకొనే పండుగ. ముఖ్యంగా చిన్నారులు బుజ్జి గణపతులను చూసి ఆనందంగా కేరింతలు కొట్టారు. పత్రి కొనుగోలు చేసి శనివారం పూజలకు సిద్ధమయ్యారు.



విగ్రహాలను తరలిస్తున్న భక్తులు

కొండపిలో పడకేసిన పారిశుధ్యం



జాళ్లపాలెం రోడ్డులో ఇరువైపులా ఉన్న చెత్త



చికెన్ షాపుల సమీపంలో పేరుకున్న చెత్త

కొండపి (సింగరాయకొండ): నియోజవర్గ కేంద్రం కొండపిలో పారిశుధ్యం దారుణంగా తయారైంది. డంపింగ్ యార్డ్ లేక రోడ్డు పక్కనే చెత్త వేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని పారిశుధ్య సిబ్బంది సేకరించిన చెత్తతో పాటు ఇతరులు వ్యర్థాలను కొండపి జాళ్లపాలెం రోడ్డులోని రోడ్డు పక్కన పడేస్తున్నారు. ఆ చెత్త పేరుకుపోయి మట్టి దిబ్బలుగా దర్శనమిస్తున్నాయి. వర్షాలు పడటంతో చెత్త కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కొండపి–జాళ్లపాలెం రోడ్డులో ప్రయాణించాలి అంటే ప్రయాణికులు ఆ దుర్గంధానికి నరకయాతన అనుభవిస్తున్నారు. కొండపిలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. సైడ్ కాలవలోని నీరు నిల్వ ఉండటంతో రాత్రిపూట దోమలతో ఇబ్బంది పడుతున్నారు. సీజన్లో దోమకాటుతో ఎక్కువ వ్యాధులు ప్రబలమై అవకాశం ఉందని వెంటనే చెత్తాచెదారాన్ని తొలగించి వ్యాధులు ప్రబలకుండా చూడాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సత్యవతి

టంగుటూరు: హెచ్‌ఐవీ/ ఏయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ సత్యవతి అన్నారు. మండలంలోని కారుమంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ప్రాధానోపాధ్యాయుడు రవి ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ/ ఏయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 9,10 విద్యార్థులకు మీకు తెలుసా కార్యక్రమం ఏర్పాటు చేసి హెచ్‌ఐవీ, ఏయిడ్స్ మధ్య తేడాను వివరించి, ఆ వ్యాధులు ఎలా వస్తాయి, ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. పిల్లలు యుక్త వయస్సులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శుభ్రత వివరించారు. సూపర్‌వైజర్ వినయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



నగలదుకాణం నిర్వాహకులకు భద్రతపై సూచనలిస్తున్న సీఐ రామానాయక్

పామూరు: నగల దుకాణం నిర్వాహకులు దుకాణాల్లో చోరీలను నివారించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ యం భీమానాయక్ అన్నారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం గోల్డ్‌మర్చంట్ అసోసియేషన్ నాయకులు, నగల దుకాణం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. విలువైన నగల అమ్మకాలు, నగల కొనుగోళ్లు, నగదు మార్పిడి జరిగే నగల దుకాణాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో ఉపయోగకరమన్నారు. దుకాణాల ముందు వాహనాల సంఖ్యలో ఎక్కువ కాకుండా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. దొంగసొత్తును కొనవద్దని హెచ్చరించారు. యాదాల వెంకట సాయికిరణ్, పాబోలు రమేష్, నొస్సం నాగేంద్రాచారి, గోష్టు రామారావు, బొగ్గవరపు వినోద్, పలువురు దుకాణం నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతాయుతంగా ఉండాలి

కనిగిరి రూరల్: సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక 3వ వార్డు సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పదికి గాను కేవలం ఇద్దరు మాత్రమే విధి నిర్వాహణలో ఉండటం పట్ల తీవ్రంగా మండి పడ్డారు.

పీఎం స్వానిధి సద్వినియోగం చేసుకోండి

కనిగిరి రూరల్: పీఎం స్వానిధి పథకాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవాం స్వానిధి సే సమృద్ధి క్యాంప్ సమావేశంలో మాట్లాడారు. ఎస్‌బీఐ మేనేజర్ అప్పారావు, ఫీల్డ్ ఆఫీసర్ సురేష్‌బాబు, మెప్మా సీఎంఎం రఘు, తదితరులు పాల్గొన్నారు.

15వ తేదీలోపు ఈ-పంట నమోదు చేసుకోవాలి



క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ఏఓ వెంకటేష్

మద్దిపాడు: మండలంలోని పలు రకాల పంటలు సాగు చేసిన రైతులు ముందుగా ఈ–క్రాపు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ తెలిపారు. శుక్రవారం మండంలోని కెల్లంపల్లి, అగ్రహారం గ్రామాల్లో ఈ–పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది పనితీరును ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి వెంకటేష్ మాట్లాడుతూ మండలంలోని సాగు చేసిన అన్ని రకాల పంటలను ఈ నెల 15వ తేదీలోగా ఈ–క్రాపు బుక్ చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఆయా రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో సాగు చేసిన కంది, సజ్జ పంటలను ఆయన పరిశీలించారు. రైతుల సస్యరక్షణ చర్యలపై తీసుకోవాల్సి జాగ్రత్తలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వ్యవసాయ సహాయకులు వి.వెంకటరామిరెడ్డి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ మూర్తి

సింగరాయకొండ: మండలంలో సీజనల్ వ్యాధుల ఉధృతి బాగా ఉందని, గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించి వ్యాధులు ప్రబలకుండా కృషి చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ మూర్తి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీలు కోరారు. ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు మట్లాడుతూ ప్రస్తుతం పాఠశాలల్లో నాడు–నేడు పనులు జరుగుతున్నాయని చెప్పారు. పనులు ఆగితే జరుగుతున్నాయని ఏ విధంగా చెబుతున్నారని, సభను తప్పుదోవ పట్టించొద్దని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పాఠశాలలో వడకుండా బయట క్యాటరింగ్ వద్ద వండిస్తునానరని, దీంతో భోజనం రుచిగా ఉండటం లేదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ మూర్తి సభ్యులకు హామీ ఇచ్చారు. తహసీల్దార్ టి.రవి, ఎంఈఓ కత్తి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.